సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 20 । జనవరి । 2023



కొత్తపల్లిలో చండీయాగం

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లి నూతన గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం చండీయాగం నిర్వహించారు.



యోగి వేమన వర్ధంతి

వేములవాడఅర్బన్: నందికమాన్ వద్ద ఆలిండియా రెడ్డి సంక్షేమ సంఘంలో గురువారం వేమన వర్ధంతి నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

జిల్లాలో ఎండకాస్తుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజన్న హుండీ ఆదాయం రూ.1.35 కోట్లు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్నకు 21 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.35 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. నగదుతోపాటు 102 గ్రాముల బంగారం, 11.200 కిలోల వెండి సమకూరినట్లు చెప్పారు. ఏఈవోలు హరికిషన్, జయకుమారి, శ్రీనివాస్, ప్రతాప నవీన్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ దాసు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సును ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు మెహందీ డిజైన్స్, హెయిర్‌కటింగ్, హెయిర్‌స్టైల్స్, ఐబ్రోస్ పెడిక్యూలర్, మెనిక్యూర్, మేకప్, వాక్స్, త్రెడ్డింగ్ నేర్పించనున్నారు. ప్రిన్సిపాల్ దాసు, కో–ఆర్డినేటర్ శ్రీవల్లి పాల్గొన్నారు.

నేడు పవర్‌లూమ్ కార్మికుల సమావేశం

సిరిసిల్లఅర్బన్: వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించి శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్‌లూమ్ కార్మికుల సమావేశం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారభించిందన్నారు. పెద్దూరు శివారులో వర్క్‌షెడ్లు పూర్తికావస్తున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం చేనేత జౌళిశాఖ, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమైనట్లు పేర్కొన్నారు. బీవైనగర్‌లోని షాదీఖానా సమీపంలోని భద్రావతి సొసైటీలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోడం రమన, నక్క దేవదాస్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న వేణు

సిరిసిల్లఅర్బన్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో గురువారం సీపీఐ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ చేపట్టారు. బుర్ర మల్లేశం, వడ్డెపల్లి లక్ష్మణ్, రామస్వామి, అనసూయ, పద్మ, లచ్చవ్వ, శంకరవ్వ, నాగరాజు, శ్రీనివాస్, దత్తు పాల్గొన్నారు.

చెట్లు నరికిన స్పెషలాఫీసర్‌కు జరిమానా

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలోని చెట్లను నరికినందుకు ఆ విద్యాలయం ప్రత్యేకాధికారికి జరిమానా విధిస్తూ గ్రామపంచాయతీ అధికారులు నోటీసు ఇచ్చారు. విద్యాలయంలోనికి పాములు వస్తుండడంతో ఆవరణలో ఉన్న చెట్లను తీయించినట్లు ఎస్‌వో నీలిమ పేర్కొన్నారు. హరితహారం కింద నాటిన చెట్లను తొలగించడం పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నేరమని ప్రతీ చెట్టుకు రూ.1,600 చొప్పున ఆరు చెట్లను కొట్టినందుకు రూ.9,600 చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం ఎస్‌ఓకు నోటీసు ఇచ్చారు.

24, 27, 30 తేదీల్లో సదెరం శిబిరాలు

సిరిసిల్ల: జిల్లా వైద్యశాలలో ఈనెల 24, 27, 30 తేదీల్లో సదెరం శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యశాల పర్యవేక్షకుడు మురళీధర్‌రావు గురువారం తెలిపారు. 24న ఆర్థోపెడిక్(ఎముకలు) సంబంధించిన పరీక్షలు, సర్టిఫికెట్ల రెన్యూవల్స్ చేస్తారని, 27న వినికిడి సంబంధించిన పరీక్షలు, రెన్యూవల్స్, 30న మానసిక దివ్యాంగులకు పరీక్షలు చేస్తారని వివరించారు. మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, మెడికల్ డాక్యుమెంట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

భక్తులకు దిక్కెవరు?



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి గుడి ఆవరణలో గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అందించేందుకు ఆలయ సిబ్బంది ఇలా మోసుకెళ్తున్నారు. అయితే ఆలయ పరిసరాల్లో వైద్యసేవలు అందక ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆలయ ఆవరణలో వైద్యం అందే పరిస్థితులు అయితే లేవు.

- రాజన్న ఆలయంలో అందుబాటులో లేని వైద్యం
- అత్యవసర వేళల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు తరలింపు
- ప్రథమచికిత్స కేంద్రంలో నాలుగు రోజులే వైద్యసేవలు
- ఆందోళనలో భక్తులు
- పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి నిజాంసాగర్‌కు చెందిన సాయిలు. రాజన్నను దర్శించుకున్న తర్వాత ఫిట్స్ వచ్చాయి. ఆలయ పరిసరాలలో ప్రథమ చికిత్స అందించే అవకాశం లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ప్రథమ చికిత్స అంది ఉంటే బతికేవాడని భక్తులు చర్చించుకోవడం వినిపించింది.

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో భక్తులకు అవ్యవసర వైద్యసేవలు అందడం లేదు. రాజన్నను దర్శించుకునే క్రమంలో అస్వస్థతకు గురైతే కనీసం ప్రథమ చికిత్స అందించే పరిస్థితులు లేవు. ఇటీవల నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తుడు సాయిలు ఫిట్స్ రాగా.. ప్రథమ చికిత్స అందక ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి సంఘటనలు గతంలోనే అనేకం జరిగాయి. అయితే ఉత్సవాల సమయంలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్న అధికారులు తర్వాత రోజుల్లో పట్టించుకోవడం లేదు.

108 చేరుకోవడం గగనమే

భక్తులకు ఏదైన ఆపదొస్తే ఆదుకునే 108 ఆలయానికి చేరుకోవడం కష్టంగా మారింది. ఇరుకైన రోడ్లు, భక్తుల రద్దీతో ఆపదలో సకాలంలో వాహనం గుడికి చేరే పరిస్థితులు లేవు. కనీసం స్ట్రెచ్చర్స్ కూడా అందుబాటులో ఉంచలేకపోతున్నారంటూ స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆలయ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

వైద్యం రాజన్నకే ఎరుక

వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు క్యూలైన్లలో, ధర్మగుండం వద్ద, ఆలయ ఆవరణలో, కోడెల నెట్టివేత సమయంలో భక్తులకు స్వల్ప గాయాలవుతుంటాయి. ఈక్రమంలో గాయపడిన భక్తులకు కనీసం ప్రథమ చికిత్స చేయించే పరిస్థితిలో వేములవాడ రాజన్న ఆలయ అధికారులు లేరు. ఇప్పటికే జరిగిన పలు సంఘటనల్లోని బాధితులను ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. అధికారులు స్పందించి ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాజేశ్వరపురం వసతిగృహంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రంలో శుక్ర, శని, ఆది, సోమవారాలు వారంలో నాలుగు రోజులు మాత్రమే సేవలు అందుతున్నాయి. మిగతా మూడు రోజుల్లో కనీసం ప్రథమ చికిత్స కూడా అందే పరిస్థితులు లేవు.


ఏదైనా జరిగితే బాధ్యులెవరు?



రాజన్న దర్శనానికి ఉపవాసంతో క్యూలైన్లలో ఉంటారు. ఈక్రమంలో ఏదైన ఆపదొస్తే కనీసం వైద్య సదుపాయం లేదు. భక్తుల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు.

– రాజగోపాల్‌రెడ్డి–ప్రశాంతి దంపతులు, హైదరాబాద్

అధికారులకు నివేదిక అందజేశాం



ప్రస్తుతం రాజేశ్వరపురం వసతిగదుల్లో నాలుగు రోజులపాటు ప్రథమ చికిత్స అందించేందుకు జిల్లా వైద్యశాఖ చర్యలు తీసుకుంటుంది. దీన్ని నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేస్తాం. ఆలయ ఆధ్వర్యంలో గతంలో దవాఖానా నడిచేది. ప్రస్తుతం దాన్ని మూసివేశారు. ఆస్పత్రి ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ను కోరతాం.

– కృష్ణప్రసాద్, ఆలయ ఈవో

కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం



సుందరయ్యనగర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు



బోయినపల్లిలో కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- సిరిసిల్లలో కంటివెలుగుకు శ్రీకారం

సిరిసిల్ల: కంటి సమస్యలు, అంధత్వాన్ని శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో కంటివెలుగును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో గురువారం కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణితో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంద పనిదినాల్లో జిల్లాలోని 255 గ్రామాలు, వేములవాడ, సిరిసిల్ల పట్టణాలలోని 67 వార్డులలో మొత్తం 322 నివాస ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 21 బృందాలు, సిరిసిల్లలో మూడు, వేములవాడలో రెండు బృందాలు పనిచేస్తాయని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే ప్రజల కంటి సమస్యలు తొలగించేందుకు కంటివెలుగును ప్రారంభించారన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కంటివెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, స్థానిక కౌన్సిలర్లు వినయ్, దిడ్డి మాధవి పాల్గొన్నారు.

జిల్లాలో తొలిరోజు కంటి వెలుగు స్వరూపం

శిబిరాలు	26
సిబ్బంది	234
పరీక్షలు	8,300
పరీక్షలు చేయించుకున్న వారు	2,849
పరీక్షలు చేయించుకున్న పురుషులు	1,386
పరీక్షలు చేయించుకున్న మహిళలు	1,463
ఇచ్చిన రీడింగ్ గ్లాసులు	756
ఇచ్చిన పాయింట్ ఆర్డర్ గ్లాసులు	783
ఆపరేషన్‌కు రెఫర్ చేసిన కేసులు	0
కంటి వెలుగు సక్సెస్ శాతం	34.3

అంధత్వ నివారణ లక్ష్యం: ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటివెలుగును ప్రవేశపెట్టారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బోయినపల్లిలోని ఆర్‌ఎంపీ భవన్‌లో గురువారం రెండోవిడత కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ఎం.సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పి.వేణుగోపాల్, జెడ్పీటీసీ కె.ఉమ, సర్పంచ్ లతశ్రీ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కె.సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.కొండయ్య పాల్గొన్నారు.

కంటివెలుగుపై అవగాహన కల్పించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): కంటివెలుగుపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. మండలంలోని లింగన్నపేట రైతువేదికలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. లింగన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు–మన బడి'లో చేపడుతున్న పనులను పరిశీలించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ చైతన్య, ఎంపీవో రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా

- తొమ్మిది రోజుల్లో రీజియన్‌లో రూ.13.82 కోట్ల ఆదాయం
- ఈనెల 18న ఒకేరోజు రూ.2.05 కోట్ల ఆదాయం



కరీంనగర్: ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రాకపోకలతో భారీ ఆదాయం సమకూరింది. పండుగ సందర్భంగా ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపించగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది రోజుల్లోనే రూ.13 కోట్ల 82 లక్షల 60 వేల ఆదాయం సమకూరింది. రీజియన్ పరిధిలో ఈనెల 18న ఒక్క రోజు రూ.2 కోట్ల 5 లక్షల 77 వేల ఆదాయం సమకూర్చుకోవడం గమనార్హం. ఆ ఒక్క రోజే 4 లక్షల 2 వేల 586 కిలోమీటర్లు తిరుగగా 2 లక్షల 11 వేల మంది ఆర్టీసీలో ప్రయాణించగా ఈ ఆదాయం వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో కరీంనగర్–1, కరీంనగర్–2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల నుంచి 410 ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు నడిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు ప్రత్యేక బస్సులు నడిచాయి. ఆర్టీసీ సంస్థ ముందుగానే పండుగ సందర్భంగా ప్రత్యేకంగా చార్జీలు వసూలు చేయమని ప్రకటించడంతో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపారు. పెట్రోల్, డీజిల్ ధరలు సైతం మండిపోతుండడంతో ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయించారు. కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో మకాం వేసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. రీజియన్ పరిధిలో ఇంత భారీమొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈనెల 10 నుంచి 18 వరకు వచ్చిన ఆదాయం

తేదీ	ఆదాయం(రూ.లక్షల్లో)
10	1,33,94,000
11	1,49,51,000
12	1,71,30,000
13	1,70,18,000
14	1,37,53,000
15	76,25,000
16	1,54,13,000
17	1,83,99,000
18	2,05,77,000
మొత్తం	13,82,60,000

ఆర్టీసీని ఆదరించాలి



కరీంనగర్ రీజియన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఆదాయం తెచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లకు, డిపో మేనేజర్లకు శుభాకాంక్షలు. ముందస్తు రిజర్వేషన్లతోపాటు అదనపు చార్జీలు వసూలు చేయకుండా, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి ఆదాయాన్ని సమకూర్చుకోగలిగాం. – ఖుస్రో షా ఖాన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

యూరియా కోసం పడిగాపులు



కోనరావుపేట(వేములవాడ): కనగర్తిలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. సింగిల్ విండో బాధ్యులు 400 బస్తాలను కనగర్తికి పంపించగా.. రైతులందరికీ అందలేవు. మరో 400 బస్తాలు తెప్పించి అందిస్తామని వైస్ చైర్మన్ భూంరెడ్డి తెలిపారు.

తెరపైకి కొత్త మండలాలు

- మాకో మండలం కావాలి !
- జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో డిమాండ్లు
- సీఎం కేసీఆర్ పర్యటనపై ఆశలు



సిరిసిల్ల శివారులోని విలీన గ్రామాల ప్రజల ఆందోళన (ఫైల్)

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో కొత్త మండలాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. 36 ఏళ్ల క్రితం మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటికీ పల్లెలు అనేక మార్పులకు గురయ్యాయి. పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం చిన్నజిల్లాలు, చిన్నమండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో జిల్లాలో కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల వారు కోరుతున్నారు. ఇటీవల 'సెస్' ఎన్నికల్లో సిరిసిల్లలోని విలీన గ్రామాల వాసులు ప్రత్యేక మండలాన్ని డిమాండ్ చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తారనే ప్రచారం నేపథ్యంలో కొత్త మండలాల ఏర్పాటుకు బాటలు పడుతాయని ఆశిస్తున్నారు.

కొత్త మండలాల డిమాండ్లు ఇవీ..

- ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లివాసులు కొద్ది రోజులుగా గాలిపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతున్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రానికి గాలిపల్లి 7 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి స్వగ్రామంగా గాలిపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉంది.
- తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. రాజన్నసిరిసిల్ల జిల్లాకు సరిహద్దు గ్రామం జిల్లెల్ల కేంద్రంగా సమీప గ్రామాలను కలుపుతూ మండల కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు.
- గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి మండల కేంద్రం చేయాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. గతంలో కొత్తపల్లి మండలం కోసం పాదయాత్రలు, నిరహార దీక్షలు చేశారు. జిల్లా సరిహద్దు గ్రామంగా కొత్తపల్లికి గుర్తింపు ఉంది.
- వేములవాడరూరల్ మండలాన్ని చెక్కపల్లి, నూకలమర్రి కేంద్రాల్లో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఆ రెండు గ్రామాల ప్రజలు మండల కేంద్రం కావాలని కోరుతున్నారు. చెక్కపల్లివాసులు ఏకంగా విరాళాలు సేకరించి మండలకేంద్రం కోసం భూమిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. వేములవాడలో కొనసాగుతున్న రూరల్ మండలాన్ని చెక్కపల్లికి మార్చాలని కోరుతున్నారు.
- సిరిసిల్ల పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాల వాసులు ఆ ఏడు గ్రామాలను కలిపి కొత్త మండలం చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ విలీనం నుంచి తొలగించి గ్రామపంచాయతీలుగా ఉంచాలని, కొత్త మండలం ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల 'సెస్' ఎన్నికల్లోనూ ఓటర్లు ఇదే విషయాన్ని ఓట్లతోపాటు చీటీలు వేసి వెల్లడించారు.
- కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, ధర్మారంవాసులు సైతం తమ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని కోరుతున్నారు.
- 2016లో కొత్తగా రాజన్నసిరిసిల్ల జిల్లా ఏర్పాటుతో రుద్రంగి, వీర్నపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ రూరల్ మండలాలు ఏర్పాటు అయ్యాయి. తొమ్మిది మండలాలను 13 మండలాలకు మార్చారు. తాజాగా కొత్త మండలాల తెరపైకి రావడం చర్చనీయాంశమైంది.



గాలిపల్లిలో గ్రామస్తుల నిరసన

మంత్రి కేటీఆర్ చొరవతో అభివృద్ధి



జిల్లెల్లలో మంత్రి కేటీఆర్ చొరవతో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది. మండల కేంద్రం కావాలనే డిమాండ్ ప్రజల్లో ఉంది. ప్రభుత్వం గుర్తించి మండల కేంద్రంగా మార్చుతుందనే ఆశలు ఉన్నాయి. సీఎం కేసీఆర్ జిల్లెల్లను మండలంగా ప్రకటిస్తారని ఆశిస్తున్నాం.

– మాట్ల మధు, జిల్లెల్ల సర్పంచ్

రూ.30 లక్షలతో స్థలం కొన్నాం



మా ఊరిని మండల కేంద్రం చేయాలని దాతల సహకారంతో ఆఫీస్‌ల కోసం రూ.30లక్షలతో మూడున్నర ఎకరాల స్థలం కొన్నాం. వేములవాడరూరల్ మండలాన్ని చెక్కపెల్లికి మార్చాలని కోరుతున్నాం. అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుంది.

– ఎడపల్లి అనిల్, చెక్కపెల్లి

నాలుగేళ్లుగా ఉద్యమిస్తున్నాం



గాలిపల్లిని మండలం చేయాలని నాలుగేళ్లుగా ఉద్యమిస్తున్నాం. అన్ని రకాలుగా గాలిపల్లికి మండల కేంద్రంగా మార్చే అర్హతలు ఉన్నాయి. గాలిపల్లి ఉద్యమాల చరిత్రను గుర్తించి ప్రభుత్వం మండల కేంద్రంగా మార్చాలి.

– అయ్యన్నగారి మహిపాల్‌రెడ్డి, గాలిపల్లి

కొత్తపల్లిని మండల కేంద్రం చేయాలి



గంభీరావుపేట మండలంలో పెద్ద గ్రామం మాది. కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలని పాదయాత్రలు చేశాం. కామారెడ్డి, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల మూడు జిల్లాల సరిహద్దులోని గ్రామం కావడంతో మా కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలి.

– గౌటే గణేశ్, కొత్తపల్లి

క్లుప్తంగా

అధికారంలోకి రావడం ఖాయం



కార్యకర్తలతో కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూరు): రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి, దాచారం గ్రామాల కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నికలో పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 9 ఏళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నయాపైసా మాఫీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఆనందరెడ్డి ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతిచెందిన సత్తయ్య

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన రైతు మినుకుల సత్తయ్య (57) అప్పుల బాధతో గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య తనకున్న మూడెకరాలకు పైగా భూమిలో భూమిని చదును చేయుటకు రూ.10 లక్షలు అప్పుగా తీసుకువచ్చి చదను చేశాడు. పంట సాగు చేయగా నష్టం రావడంతో అప్పులు తీర్చడంపై మనోవేదనకు లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెంది తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి సత్తయ్య కుమారుడు సంపత్‌కు తెలియజేయగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యం భరించలేక..

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని లక్ష్మాజిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఉప్పుల తిరుపతిరెడ్డి (57) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. కొన్ని రోజుల నుంచి తిరుపతిరెడ్డి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికాలో స్థిరపడ్డాడు. చిన్నకుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


చికిత్స పొందుతూ ఎఫ్‌సీఐ ఉద్యోగి మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్– చొప్పదండి రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎఫ్‌సీఐ ఉద్యోగి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ధరావత్ సంపత్(34) కరీంనగర్‌లోని కట్టారాంపూర్ నివాసముంటూ ఎఫ్‌సీఐ టెక్నికల్ అసిస్టెంట్‌గా నగునూరు గోదాముల్లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9.30గంటలకు సంపత్ కరీంనగర్ నుంచి నగునూరుకు ద్విచక్రవాహనంపై గోదాముకు వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 10.30గంటలకు మృతిచెందాడు. గురువారం మృతుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మామిడిపల్లి జాతర పోయొద్దాం



జాతరకు ముస్తాబవుతున్న మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం



ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌లు

- 21 నుంచి మాఘమాస్య జాతర
- పలు జిల్లాల నుంచి హాజరుకానున్న భక్తులు
- మామిడిపల్లిలో అన్ని రకాల ఏర్పాట్లు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి మాఘమాస్య జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు రెండు రోజులపాటు జరుగనున్నాయి.

అతి పురాతన ఆలయం

మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి అతి ప్రాచీన చరిత్ర ఉంది. శ్రీరాముడు అరణ్యవాసకాలంలో మామిడిపల్లిగుట్ట వద్దకు వచ్చి సేద తీరాడని ఆలయ పురాణం చెబుతోంది. పూర్వకాలంలో ఇక్కడ మహామునులు తపస్సులు చేసే వారని ఆలయ చరిత్ర చెబుతోంది. మునుల తపస్సుతోనే ఈ గ్రామాన్ని మహామునిపల్లెగా పిలిచేవారని ప్రతీతి. కాలక్రమేన మామిడిపల్లిగా రూపాంతరం చెందింది. ఈ ఆలయంపై శ్రీరాముని పాదముద్రికలు, రథచక్రాల గుర్తులు కనిపిస్తాయి.

పూర్తవుతున్న ఏర్పాట్లు

మాఘమాస్య జాతర సందర్భంగా మామిడిపల్లి ఆలయంలో అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. గుట్టపైకి వెళ్లే ఘాట్‌రోడ్డును చదును చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఆలయం ముందు గల మైదానాన్ని చదును చేసి, విద్యుత్ పనులు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తెలిపారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



మామిడిపల్లిలోని జాతరకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం. భక్తులకు తాగునీటి వసతి, గుట్టపైకి నీడ ఏర్పాట్లు చేయించాం. శనివారం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. అధికారులు, గ్రామస్తుల సహకారంతో జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం.

– కొక్కుల భారత, సర్పంచ్, మామిడిపల్లి

అంతా మా ఇష్టం...!

- నిబంధనలు బేఖాతరు
- ఉదయాన్నే తెరుచుకుంటున్న వైన్‌షాపులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులు



‘ఇది వేములవాడ మండలం హన్మాజిపేట గ్రామం వద్ద ఉన్న వైన్ షాపు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల తర్వాత తెరిచి మద్యం విక్రయించాలి. కానీ గురువారం ఉదయం 9.30 గంటలకే షాపు తెరిచి విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా ఈ ఒక్క చోటనే కాదు మండలంలోని పలు చోట్ల చాలా వరకు వైన్‌షాపులు నిబంధనలు పాటించకుండా ఉదయాన్నే తెరుస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

వేములవాడరూరల్: వైన్‌షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామం వద్ద ఉన్న వైన్‌షాపు రోడ్డు పక్కన ఉండడంతో వ్యవసాయ పనుల కోసం అటుగా వెళ్లే మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో కూడా నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి వరకు విక్రయాలు జరుపుతున్నారని గ్రామస్తులు అంటున్నారు.

పర్యవేక్షణ కరువు

మండల పరిధిలో ఉన్న పలు వైన్‌షాపులపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక నిర్వాహకులు ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వట్టెంల, హన్మాజిపేట గ్రామాల్లోని షాపులు రోడ్ల పక్కనే ఉండడంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాహకులు సమయపాలన లేకుండానే దుకాణం నిర్వహించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సమయపాలన లేదు



హన్మాజిపేటలో ఉన్న బ్రాందీషాప్‌నకు సమయపాలన లేదు. ఉదయాన్నే తీసి విక్రయిస్తున్నారు. రాత్రి కూడా ఎప్పుడు బంద్ చేస్తరో తెలియదు.

– తీగల ఎల్లాగౌడ్, హన్మాజిపేట

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఉదయం 10 గంటల తరువాతే వైన్‌షాపులు తెరవాలి. నిబంధనలు పాటించని షాపుల నిర్వాహకులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– రాము, ఎక్సైజ్ సీఐ, వేములవాడ

పోలీస్ బాస్ ఆఫీస్ రెడీ

- ఆధునిక హంగులు.. సకల సౌకర్యాలు
- ప్రారంభోత్సవానికి డీపీవో సిద్ధం



సిరిసిల్లలోని జిల్లా పోలీస్ కార్యాలయ భవనం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయం సిద్ధమైంది. రాజ భవనాన్ని తలపించేలా ఆధునిక హంగులు, అన్ని వసతులతో జిల్లా పోలీస్‌బాస్ ఆఫీస్ ముస్తాబైంది. రెండు అంతస్తులతో సర్వాంగ సుందరంగా డీపీవో ఆఫీస్ సిద్ధమైంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 16 విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా ఎస్పీ, ఏఎస్పీ చాంబర్లతోపాటు, ఎస్డీలు, సీసీలు, పీఆర్వోలకు వేర్వేరుగా గదులు ఉన్నాయి. పాస్‌పోర్టు విచారణ విభాగంతోపాటు ఇన్, అవుట్ వార్డులను, రిసెప్షన్, గ్రీవెన్స్, ఐటీసీ విభాగాలను ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో పరిపాలన విభాగాలు, మినీ కాన్ఫరెన్స్‌హాల్ తోపాటు న్యాయసేవ విభాగాలను ఏర్పాటు చేశారు. రెండో అంతస్తులో ఐటీకోర్, ట్రాఫిక్ కంట్రోల్, సీసీటీఎన్ఎస్ విభాగాలతోపాటు నేర పరిశోధనలలోని శాస్త్రీయ విభాగాలను, మహిళా పోలీస్ సిబ్బంది విశ్రాంతి గదులు, క్లూస్ టీం డీసీఆర్‌బీ వంటి విభాగాలకు గదులు కేటాయించారు.

రూ.21 కోట్లతో పనులు

జిల్లా ఆవిర్భావం నుంచి డీపీవో స్కూల్ భవనంలో ఉంది. సొంత భవనాన్ని కలెక్టరేట్ సమీపంలోనే తొలుత రూ.19 కోట్లతో 52 వేల చదరపు అడుగులతో రెండు అంతస్తులను నిర్మించారు. కోటను తలపించేలా ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించేందుకు మరో రూ.2 కోట్లు ఖర్చు అయ్యాయి.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ యాగం



మార్కండేయ యాగంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తదితరులు

సిరిసిల్లకల్చరల్: మార్కండేయ జయంతి వేడుకల నేపథ్యంలో రోజుకో ఆలయంలో మార్కండేయ మహాయజ్ఞాలు నిర్వహిస్తున్నారు. గురువారం బీవైనగర్‌లోని హనుమాన్‌మందిరంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు దార్నం అరుణ, ఆడెపు సౌజన్య, గెంట్యాల శ్రీనివాస్, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రతినిధులు గాజుల బాలయ్య, మండల సత్యం, కోడం శ్రీనివాస్ మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, రాపెల్లి కల్యాణ్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీధర్

గంభీరావుపేట(సిరిసిల్ల): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గోల్కొండ శ్రీధర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం రంగారెడ్డి జిల్లాలో జరిగిన మహాసభలో ఈ మేరకు ఎన్నుకున్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీధర్ పనిచేస్తున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాకాల శంకర్‌గౌడ్, మహేందర్‌రావు అభినందనలు తెలిపారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు

- 21న జగిత్యాలలో స్క్రీనింగ్ టెస్ట్

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఇటీవల నిర్వహించిన స్క్రీనింగ్‌టెస్ట్‌లో అర్హత సాధించిన 25 మందికి ప్రత్యేక శిక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రెండో బ్యాచ్ అభ్యర్థుల కోసం ఈ నెల 21న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జగిత్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగే ఈ పరీక్షకు హాజరయ్యే నర్సింగ్ గ్రాడ్యుయేట్లు ఉదయం 10 గంటల్లోపు కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, అదనంగా వృత్తిపరమైన నైపుణ్యాలలో మెలకువలు నేర్పనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99519 09863లో సంప్రదించాలని సూచించారు.

యాసంగి రైతుబంధు రూ.129 కోట్లు

- జిల్లాలో 1.19 లక్షల మంది రైతులకు లబ్ధి
- మెజార్టీ రైతుల ఖాతాల్లో డబ్బులు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

బోయినపల్లి(చొప్పదండి): యాసంగి రైతుబంధు డబ్బులు మెజార్టీ రైతుల ఖాతాల్లో జమయ్యాయి. రైతుబంధు కింద ఈ నెల 12 వరకు జిల్లాలోని 13 మండలాల్లో 1,19,331 మంది రైతులకు రూ.126,02,69,980 మేర డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.

పొలం పనుల్లో బిజీ

యాసంగి పెట్టుబడి సాయం అందడంతో రైతులు తమ పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లాలో యాసంగిలో సుమారు 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.02 లక్షల ఎకరాల మేర వరి నాట్లు పూర్తి చేశారు. కాగా ఈ సారి రైతులు కొందరు యాసంగి పత్తి పంట వేస్తున్నారు. మరి కొందరు కూరగాయాలు, చెరుకు, ఆయిల్ పామ్ తదితర పంటలు సాగు చేస్తూ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

జిల్లాలో 12-01-2023 వరకు రైతుబంధు వివరాలు

పెట్టుబడి సాయం అందిన రైతులు	1,19,331
మంజూరైన పెట్టుబడి సాయం	రూ.129 కోట్లు
రైతుల ఖాతాల్లో జమయిన డబ్బు	రూ.126 కోట్లు

ఐదెకరాల్లో వరి సాగు చేస్తున్న



మాకు నాలుగు ఎకరాల మేర భూమి ఉంది. యాసంగి సీజన్‌లో పెట్టుబడి సాయం రూ.20 వేలు అందింది.మరో ఎకరం కౌలుకు తీసుకుని మొత్తం ఐదెకరాలు వరి సాగు చేస్తున్న. వరి నాట్లు వేయడం పూర్తయింది.

– బోయిని రాములు, రైతు, బోయినపల్లి

హుషారుగా ‘అలోహ’



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మనోహర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలోహ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలుండాలనే ఉద్దేశంతో అలోహ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళా శాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు ప్ర వీ ణ్‌కుమార్,బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల్లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఆడేపు రవీందర్

సిరిసిల్లఅర్బన్: బతుకమ్మ చీరల తయారీలో నాణ్యత పాటించి, కాటన్ వస్త్రపరిశ్రమను పునరుద్ధరించాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో–కన్వీనర్ ఆడేపు రవీందర్ కోరారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏటా రూ.330 కోట్లతో కోటి బతుకమ్మ చీరలను తయారు చేయించి మహిళలకు అందజేస్తుందన్నారు. బతుకమ్మ చీరలు పాలిస్టర్‌తో ఉత్పత్తి చేయడంతో మహిళలు వాటిని ధరించేందుకు సుముఖత చూపడం లేదని పేర్కొన్నారు. కాటన్ చీరల తయారీని పునరుద్ధరిస్తే కాటన్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని, 10హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయాలని కోరారు. బీజేపీ నాయకులు నాగుల శ్రీనివాస్, సదానందం, భాస్కర్, రాహుల్, ఇంజపురి మురళీ, తడుక విజయ్ పాల్గొన్నారు.

శభాష్.. జెడ్పీ సీఈవో

- ఎంఏయూడీ డిప్యూటీ డైరెక్టర్ పేరుతో ఫోన్‌కాల్స్
- జిల్లా పరిషత్‌కు నిధులిస్తామని కేటుగాళ్ల ఎర
- కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రియాంక



ప్రియాంక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ‘నేను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) నుంచి మాట్లాడుతున్నాను. ఎంఏయూడీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. కరీంనగర్ జిల్లాకు నిధుల అవసరం ఉందా? ఉంటే మాకు చెప్పండి. కావాల్సినన్ని నిధులు మంజూరు చేస్తాం. మీరు అడిగినన్ని నిధులు మంజూరు చేస్తాం కాకపోతే, మీరు నాకు కొంత కమీషన్ ముట్టజెప్పాల్సి ఉంటుంది.’ ఇదీ.. కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకకు వచ్చిన ఫోన్ కాల్. గురువారం ఉదయం 73867 19629 నెంబరు నుంచి కాల్ రాగా.. తొలుత ఎంఏయూడీ నుంచి వచ్చినట్లుగానే భావించారు. కానీ.. డిప్యూటీ డైరెక్టర్‌గా తనను తాను పరిచయం చేసుకున్న తీరు, నిధుల ప్రస్తావనపై అనుమానం కలిగింది. నిధులు కావాలంటే.. ఇలా ఎవరూ ఫోన్ కాల్స్ చేయరని గ్రహించిన ఆమె అతను చెప్పింది విన్నారు. కానీ.. ఎక్కడా అతని మాటలకు తొందరపడలేదు. అతను మోసగాడని గ్రహించి ఏమేం కావాలో అడిగారు. దీంతో అతను ముందుగా తనకు కమీషన్ కింద డబ్బులు వేయాలని సూచించడంతో సరే అని ఫోన్ పెట్టేశారు.వెంటనే విషయాన్ని పోలీసులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెంబరు నుంచి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకకే కాకుండా.. రాష్ట్రంలోని పలువురు మున్సిపల్, జిల్లా చైర్‌పర్సన్లకు కూడా కాల్స్ వెళ్లినట్లు తెలిసింది. వెంటనే ఈ విషయాన్ని మున్సిపల్, జిల్లా పరిషత్ అధికారులకు వాట్సాప్ సందేశం ద్వారా ఆయా విభాగాల అధికారులు హెచ్చరించారు. ఈ విషయంలో కొసమెరుపు ఏంటంటే.. జెడ్పీ సీఈవో నుంచి ఫేక్ కాల్ విషయంపై ఫిర్యాదు రాగానే.. పోలీసులు సదరు నెంబరు వివరాలపై ఆరా తీస్తున్నారు. ట్రూ కాలర్‌లో ఆ నెంబరు శ్రీకాంత్, డీడీ, ఎంఏయూడీ అని ఫీడ్ చేసి ఉండటం గమనార్హం. ఇటీవల మే నెలలో జగిత్యాల జిల్లా మల్యాల తహసీల్దార్, ఎస్సైలకు ఏసీబీ డీఎస్పీ పేరిట సైబర్ కేటుగాడు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కరీంనగర్ కమిషనరేట్‌లో సైబర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2021లో కేవలం 34 కేసులు నమోదు కాగా, 2022లో 86 కేసులు రికార్డయి సైబర్ నేరాలు రెట్టింపయ్యాయి. ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సత్యనారాయణ ప్రజలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ మహాత్మానగర్ చెందిన మహమ్మద్ అన్వర్ (51) తన ఎక్సెల్ బైక్‌పై తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా అల్గునూర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అన్వర్ బైక్ నుంచి కింద పడ్డాడు. ఢీకొట్టిన వాహనం అన్వర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

వేశ్యగృహాలపై పోలీసుల దాడులు

- ముగ్గురు మహిళలకు విముక్తి
- ఇద్దరిపై కేసు : డీఎస్పీ ప్రకాశ్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వేశ్య గృహాలపై డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 10 పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశాయి. వ్యభిచార కూపంలో మ గ్గుతున్న ముగ్గురు మహిళలను గుర్తించి సఖీ కేంద్రానికి తరలించారు. మహిళలతో బలవంతంగా వ్యభి చారం నిర్వహిస్తున్న ప్రతాప్ తోపాటు అతడి భార్య పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దాడుల్లో పట్టణ సీఐ కిశోర్, రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సైలు సంజీవ్, రహీం, అనిల్, రాము, శ్వేత పాల్గొన్నారు.